క్లుప్తంగా

నేడు 'సత్యసాయి ప్రేమ ప్రవాహిని' రథోత్సవం



పెనుకొండ: శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవాన్ని గురువారం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు స్థానిక సత్యసాయి సేవా సమితి నాయకులు తెలిపారు. సత్యసాయిబాబా 100వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విశ్వశాంతి కోరుతూ దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్న సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం ఉదయం 11 గంటలకు పెనుకొండకు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా మంగళవాయిద్యాలు, భజన కార్యక్రమాలు, మంగళ హారతులతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, భజన మండలి కన్వీనర్లు, సేవాదళ్ భక్తులు, పట్టణ ప్రజలు వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

రాజకీయ కక్షతోనే మిథున్‌రెడ్డి అరెస్ట్

మడకశిర: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, న్యాయవాది అశ్వత్థనారాయణ ఒక ప్రకటనలో విమర్శించారు. చిత్తూరు జిల్లాలో మొదటి నుంచి చంద్రబాబుకి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ ప్రత్యర్థి అని తెలిపారు. రాజకీయంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని దెబ్బ తీయడానికే మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయించారన్నారు. అసలు రాష్ట్ర ప్రభుత్వస్థాయిలో జరిగే లిక్కర్ పాలసీతో ఎంపీ మిథున్‌రెడ్డికి ఏం సంబంధమని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి ఈకేసు నుంచి నిర్దోషిగా బయటికి రావడం తథ్యమన్నారు.

కేజీబీవీ తనిఖీ



రొద్దం కేజీబీవీలో భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

రొద్దం: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా? లేదా అని విద్యార్థునులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పలు సమస్యలపై ఎస్ఓ నాగరత్నమ్మతో ఆరా తీశారు. ఆయన వెంట డీటీ చంద్రశేఖర్ ఉన్నారు.

25న జాబ్‌మేళా

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకి హాజరయ్యేవారు పూర్తి వివరాల కోసం 9966682246ను సంప్రదించాలన్నారు.

అచ్యుతానందన్ ఆదర్శప్రాయుడు



కేరళ మాజీ సీఎం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుకొండ: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు హరి మాట్లాడుతూ ఒక సాధారణ కొబ్బరి పీచు తీసే కార్మికుడి స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన కామ్రేడ్ అచ్యుతానందన్ నేటి రాజకీయ నాయకులకు ఆదర్శ ప్రాయుడన్నారు. ఆయన ఆదర్శాలను కొనసాగించాల్సిన బాధ్యత ఈ తరం నాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో బాబావలి, తిప్పన్న, నరసింహ, ఆనంద్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బొలెరో

హిందూపురం: మండల పరిధిలోని శ్రీకంఠపురం లోని లేపాక్షి రహదారిలో ఎదురుగా వస్తున్న కారును బొలెరో వాహనం ఢీ కొనడంతో బొలెరో డ్రైవర్ మల్లికి చేతికి బలమైన గాయాలయ్యాయి. వేగంగా వస్తున్న బొలెరోను లేపాక్షి వైపు నుంచి వస్తున్న కారును ఢీకొంది. దీంతో బొలెరో వాహనం చెరువులోకి దూసుకెళ్లి చెట్టుకు ఢీకొని నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

రొళ్ల: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధితశాఖ వార్డెన్లు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ షెక్షావలి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రత్నగిరిలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మెను ప్రకారం భోజనం నాణ్యతగా వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

పారని మురుగు



బోయగేరికి వెళ్లేదారిలో డ్రైనేజ్ దుస్థితి

పెనుకొండ: పట్టణంలోని కుమ్మరిగేరి, బోయగేరి, అర్బన్ కాలనీ, వైఎస్సార్ జగనన్న కాలనీలకు వెళ్లే రహదారి దుర్గంధ భరితంగా మారింది. డ్రైనేజీ మొత్తం చెత్తా చెదారంతో నిండిపోయి ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువ నిండా నిండిపోయాయి. డ్రైనేజీలోని మురుగు నీరు ఎటూ వెళ్లకపోవడంతో అటుగా వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిందే. మురుగుతో రోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భయం.. భయం..



చేతికందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం ఎస్సీ బాలిక వసతి గృహం ముందు భాగంలో చేతికందే ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు కంచె ఏర్పాటు చేయలేదు. ఇక్కడే బాలికల వసతి గృహం ఉండటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో పొరపాటున ఎవరైనా తాకినా లేదా విద్యుత్ సరాఫరా ఉన్నప్పుడు అటుగా ఎవరైనా వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా చుట్టూ కంచె వేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఇంటిని తాకుతూ వెళ్లిన 11 కేవీ విద్యుత్ వైర్లు

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్లకు అనుకొని ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు వేళాడుతుండటంతో వైర్లపై రాళ్లు వేళాడదీశారంటున్నారు. ఇదిలా ఉండగా సమస్య తమ దృష్టికి వచ్చిందని త్వరలోనే పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు చెబుతున్నారు.

చంద్రబాబు మోసాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి



8వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న వేణురెడ్డి

చిలమత్తూరు: సూపర్‌సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు పథకాలు అమలు చేయకుండా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 8వ వార్డు నేతలతో సమావేశమయ్యారు. వార్డులో ఉన్న వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రామ్మూర్తి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో నాయకులు

వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డితో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, సీనియర్ నేత అమరనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దిలీప్‌కుమార్, ప్రణయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ కేసులో అరెస్టు అయ్యారని, ఆ కేసు నుంచి త్వరగా బయటపడాలని తిరుమలేశుడిని వేడుకున్నట్లు వేణురెడ్డి తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



గుడిబండ: రాగి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వీరనరేష్

రొళ్ల: రైతులు పంటసాగులో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టి అధిక దిగుబడి సాధించాలని ఏఓ వెంకటబ్రహ్మం పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని దొమ్మరహట్టి, వడ్రహట్టి గ్రామాల్లో వ్యవసాయ అనుబంధశాఖల సిబ్బందితో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపట్టారు.

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ, కొంకల్లు గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఏఓ వీరనరేష్ .. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

చదువుకు వైకల్యం అడ్డు కాదు



విభిన్న ప్రతిభావంతులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని భవిత కేంద్రంలో ఎస్ఎస్‌సీ–2025లో విభిన్న ప్రతిభావంతులైన ఆరుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో బుధవారం పట్టణంలోని భవిత కేంద్రంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ గంగప్ప అధ్యక్షత వహించగా మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజ్, ఆల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబులు పాల్గొని భవిత కేంద్రం విద్యార్థులు మంజుశ్రీ, దివ్యశ్రీ, సుహాన, అజాం, సాయి శ్రావణ్, గాయత్రిలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకు వైకల్యం అడ్డు కాదని, అనేక ప్రముఖులు స్టీఫెన్ హాకింగ్, జైపాల్ రెడ్డి తదితరులు ఆదర్శంగా నిలిచారన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

రొద్దం: వ్యవసాయ మోటార్లకు సరఫరా చేసే సమయంలో విద్యుత్ అంతరాయం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులకు బుధవారం రైతులు వినతిపత్రం సమర్పించారు. రోజుకు 20 సార్లు అంతరాయం కలుగుతోందన్నారు. వ్యవసాయానికి అవసరమైన నీటి అందించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. విద్యుత్ అంతరాయం నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, ఎస్ నారాయణరెడ్డి, నరసింహులు, లక్ష్మినారాయణరెడ్డి, రైతులు క్రిష్టప్ప, ఈశ్వర్, చిన్న ఓబుళేసు, ఆదిమూర్తి తదితరలు పాల్గొన్నారు.

పీ4తో పేదలకు చేయూత



బదిలీపై వెళ్తున్న కార్యదర్శులను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రభుత్వం చేపడుతున్న పీ4 సర్వే ద్వారా గ్రామీణ పేద ప్రజలకు చేయూతనిస్తూ ఆర్థికంగా లబ్ధిచేర్చాడానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. బుధవారం హిందూపురం మండలం తూమకుంట గ్రామంలో సర్పంచ్ రత్నమ్మ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో పీ4 సర్వే జోరుగా సాగుతోందన్నారు. ఇదిలా ఉండగా.. బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటిఎమ్పీడిఓ శివకుమార్, కార్యదర్శి కెంచరాయప్ప పంచాయతీ కార్యదర్శులు తదితరులుపాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



గుడిబండలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజకుమార్

రొళ్ల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ వీరాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆటో, టెంపో ఇతరాత్ర వాహనాల డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

గుడిబండ: ప్రయాణ సమయంలో రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఆటో డ్రైవర్లు పని చేయాలని సీఐ రాజకుమార్ సూచించారు. బుధవారం స్థానిక పట్టణ కేంద్రలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అగళి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో బుధవారం ఆటోడ్రైవర్లకు ఎస్ఐ వీరేష్ రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా ఎస్ఐ వీరేష్ ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

పెనుకొండ: ఆటోడ్రైవర్లు రోడ్డు ప్రయాణాల్లో నియమ నిబంధనలు పాటించాలని సీఐ రాఘవన్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం రోడ్డు ప్రయాణాల్లో ఆటోడ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మడకశిర: పట్టణంలో బుధవారం ఆటోడ్రైవర్లకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నగేష్ బాబు మట్లాడుతూ ఆటోడ్రైవర్లు పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను పునరుద్ధరించాలి



అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని వర్గాల పేదలకు విస్తృతంగా పారదర్శకంగా సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని విద్యార్థులు బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హలుకూరు సమీపంలోని ఏపీ మోడల్ పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం బస్టాండు, మెయిన్ బజార్ మీదుగా ర్యాలీగా వెళ్లి స్థానిక పోస్టాఫీసుల 1600 పోస్టు కార్డులను కేంద్ర హోంమంత్రికి పోస్టు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, గృహాలతో పాటు అనేక అభివృద్ధి పనులను చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా తెలివైన పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నత విద్యను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఆర్డీటీ దయవల్ల ఎంతో మంది ఇంజనీర్లు, డాక్టర్లుగా స్థిరపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాఖ్య రీజనల్ కోఆర్డినేటర్ నారాయణ, ఉపాధ్యక్షుడు శంకర్, మండల అధ్యక్షుడు సురేష్, మడకశిర తాలుకా సీపీఐ కార్యదర్శి పవిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఆర్డీటీ సిబ్బందితో కలిసి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. పేద ప్రజల అభివృద్ధికి దృష్టిలో పెట్టుకుని ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసి ఆర్డీటీ సేవలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక బస్సులు

హిందూపురం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లాలోని మురడి, నేమకల్లు, కసాపురం గ్రామాల్లో వెలసిన ప్రముఖ ఆంజనేయ స్వామి ఆలయాలను ఒకేరోజు సందర్శించుకోవడానికి ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు హిందూపురం డిపో మేనేజర్ పి. శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 26 నుంచి శ్రావణమాసం సందర్భంగా ప్రతి శని, మంగళ వారాల్లో హిందూపురం డిపో నుంచి బస్సులు బయలు దేరతాయన్నారు. ఈ నెల 26, 29 తేదీలతో పాటు ఆగస్టు 2, 5, 9, 12, 16, 19 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 50 మంది ఒక బ్యాచ్‌గా ప్రయాణించాలనుకున్నా వారి ప్రాంతానికే బస్సును పంపి అటు నుంచి దూరాన్ని బట్టి టిక్కెట్టు చార్జీ వసూలు చేయడం జరుగుతుందన్నారు. హిందూపురం నుంచి బస్సుచార్జీ పెద్దలకు రూ.710, పిల్లలకు రూ.380 ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9440834715, 8977225997 సంప్రదించవచ్చన్నారు.

సంక్షిప్త సమాచారం

మట్టి టిప్పర్ పట్టివేత

పరిగి: మండలంలోని పరిగి పెద్ద చెరువు ప్రాంతంలో బుధవారం అక్రమంగా మట్టిని తరలిస్తూ ఓ టిప్పర్ పోలీసులకు పట్టుబడింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మండలంలో కూటమి నాయకులు ఇష్టారాజ్యంగా మట్టి, ఇసుకను తరలిస్తున్నా చట్టపరమైన చర్యలకు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

అమరాపురం: మండలంలోని మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏసీ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల లీడర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారు, పుస్తకాల నిర్వహణ, తదితర వాటిని పరిశీలించారు. రికార్డులు పక్కాగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ముత్యాలప్ప, సీసీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, హాస్టల్‌ను బుధవారం ఎంఈఓ–2 చంద్రశేఖర్ నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధనా తీరు, సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

యంత్రాల వాడకంపై శిక్షణ

మడకశిరరూరల్: మండలంలో ఆముదం పంట సాగు చేసే రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటిస్తూ లాభాలు పొందాలని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి తెలిపారు. న్యూఢిల్లీ భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఎస్సీ ఉప ప్రణాళిక కింద బుధవారం స్థానిక వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రామీణ ఎస్సీ రైతులకు ఆముదం, యంత్రాల వాడకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యంత్రాల వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం గౌడనహళ్లి, ఆర్ అనంతపురం, ఈచలెడ్డి, రేకులకుంట గ్రామాలకు చెందిన 36 మంది ఎస్సీ రైతులకు హైబ్రిడ్ ఆముదం విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సమన్వయకర్త డాక్టర్ శ్రీగిరి, వ్యవసాయ యాంత్రీకరణ విభాగం అధికారి డాక్టర్ హరిబాబు, అధ్యాపకులు డాక్టర్ మురళీకృష్ణ, సుమతి, మంజుల, ప్రశాంతి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

గుడిబండ: బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులను మండల కేంద్రంలోని సచివాలయ ఆవరణలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులను ఎంపీడీఓ కేశవరెడ్డి, ఈఓఆర్డీ నాగరాజునాయక్, పలువురు అధికారులు పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఎంపీడీఓ కేశవరెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగుల సేవలను కొనియాడారు. సచివాలయ ఉద్యోగులు నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారి

గుడిబండ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెండు రకాల సామాజిక భద్రత జీవిత బీమా పథకాలపై బుధవారం స్థానిక పట్టణ కేంద్రంలోని కెనరా బ్యాంక్ వద్ద బ్యాంక్ ఖాతాదారులకు అవాగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద కేవలం రూ.20 కడితే రూ.2 లక్షలు, రూ.450 కడితే రూ.4 లక్షల వరకూ జీవిత బీమా పొందవచ్చన్నారు. సహజంగా లేదా ఇతర కారణంతో ఖాతాదారుడు మరణించినా ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షలు పరిహారం వస్తుందన్నారు. బ్యాంక్ మేనేజర్ మల్లయ్య, సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ నాగేంద్ర, శృతి బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ముస్లిం ఐక్యవేదిక కమిటీల ఏర్పాటు

మడకశిర: మడకశిర నియోజకవర్గానికి సంబంధించిన ముస్లిం ఐక్య వేదిక వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ కమిటీలను ఏర్పాటు చేసినట్లు బుధవారం ముస్లిం ఐక్యవేదిక స్థానిక నాయకులు తెలిపారు. మడకశిర పట్టణానికి చెందిన వసీంబేగ్ జిల్లా ముస్లిం ఐక్యవేదిక విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులైనట్లు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గ విభాగం అధ్యక్షుడిగా దాదాపీర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సిద్ధిక్, కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా మహబ్, పట్టణ అధ్యక్షుడిగా బాబా, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా షేక్‌బాబా ఫక్రుద్దీన్, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా షేక్‌ఇర్ఫాన్ నియమితులయ్యారన్నారు.

నేడు పరిగిలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో'

పరిగి: మండలంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు విట్టాపల్లి, 9 గంటలకు పీ నరసాపురం, 11.30లకు కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ బిందూనగర్, మారుతీనగర్, 12 గంటలకు మోదాలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఓటరు జాబితా సవరణపై సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ రూరల్: ఓటరు జాబితాలోని సవరణలపై రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్ బుధవారం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలోని సవరణలపై చర్చించారు. 18 ఏళ్ల నిండిన యువతీయువకులు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర అంశాలపై పార్టీల నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.స్వాతి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడిగా అనిల్



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే (శని మహాత్మ కార్య నిర్వాహక సంఘం) నూతన అధ్యక్షుడిగా జీ అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అతనితో పాటు ఉపాధ్యక్షుడిగా లాయర్ వెంకట్రామరెడ్డి, కార్యదర్శిగా పీవీ సుబ్బ నరసింహ, కోశాధికారిగా వైఆర్ మోహన్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎస్ఎస్‌కే సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో ఎలాంటి పోటీ లేకుండా స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప సూచనల మేరకు ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

హిందూపురం టౌన్: హిందూపురం పురపాలక యాజమాన్య పరిధిలో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం నాయకులు బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారికి బుధవారం విన్నవించారు. ఎంటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో విద్యార్థులకు తగ్గట్టు ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల ఇబ్బందులొస్తున్నాయని, డీఎస్సీ నియామకాలు జరిగే వరకు తాత్కాలిక ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రామ్మోహన్, సురేంద్రలు పాల్గొన్నారు.